బీసీల మహాధర్నాను జయప్రదం చేయాలి

● మాజీ ఎంపీ హనుమంతరావు

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బిల్లును ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే ఓబీసీ బిల్లు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఏప్రిల్ 2న చలో ఢిల్లీ, జంతర్‌మంతర్ వద్ద జరిగే బీసీల మహాధర్నాను జయప్రదం చేసేందుకు బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడోయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చట్టం చేశారని, ఇది దేశానికే మార్గదర్శకమని, చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ అంశాన్ని 9వ షెడ్యూల్డ్‌లో చేసి చట్టం చేయాలని కోరుతూ ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీ కుల సంఘాలతో కలిసి పోరుగర్జన చేపడుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేసుకోవడానికి ఈ పోరుగర్జన నిర్వహిస్తున్నామన్నారు.

2న ఉగాది ప్రతిభా పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ మానస ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం త్యాగరాయగానసభలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ రంగాల నిష్ణాతులకు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాల ప్రదాన సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి రఘుశ్రీ తెలిపారు. బల్‌వీర్, వై శ్రీలక్ష్మి, డా. ఐశ్వర్య, చీదెళ్ల సీతాలక్ష్మి, నవకాంత్, డా. కె సాంబమూర్తిలకు పురస్కారాలను ప్రముఖ కవి వీపీ చందన్‌రావు ప్రదానం చేస్తారన్నారు.

హక్కులపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం

● అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి

నల్లకుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్‌లోని నర్సింహబస్తీ కమ్యూనిటీ హాల్‌లో (సివిల్ రైట్స్ డే) పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ వీరాబాయి, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, నల్లకుంట ఎస్‌ఐ వెంకటరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బలరాం, ప్రదీప్, ఆర్‌ఐ భిక్షపతి, ఏఎస్‌వో వి.సునీత, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె. మోహన్, జీహెచ్‌ఎంసీ అధికారులు చంద్రశేఖర్, ఎం.డి. ఫర్హత్, ఐలయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో నర్సింహ బస్తీ అధ్యక్షుడు ఎం. భూపతినాథ్, తదితరులు పాల్గొన్నారు.




ఉగాది పచ్చడి కోసం కుండలు కొనుగోలుచేస్తున్న మహిళ, పండగకు మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల పూల దుకాణాలు




వేప ఆకులు, మామిడికాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఉగాదికి సర్వం సిద్ధం

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావాసు నామ ఉగాది తెలుగు నూతన సంవత్సరానికి సర్వం సిద్ధమైంది. పండగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉగాది పండగకు మామిడి కాయలు, వేప ఆకులు, కుండలు, పువ్వులు, పంచాంగాలను కొనుగోలుదారులతో మార్కెట్ సందడిగా మారింది. ఉగాది పండగను పురస్కరించుకుని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలోని ఆలయాలు పండగ శోభను సంతరించుకున్నాయి. ఆలయాలను పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉగాది పంచాంగ శ్రవణం చెప్పేందుకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే కుల, బస్తీ సంఘాల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలకు ఏర్పాట్లు చేశారు. రాంనగర్ రామాలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ ముదిరాజ్ తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జెమినీ కాలనీ పవిత్రనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వి.సుధాకర్ గుప్తా తెలిపారు.



ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

● బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం సాయంత్రం భోలక్‌పూర్ డివిజన్ బడీ మసీదులో ముత్తవల్లి నజీర్ అలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జైసింహ, ముస్లింలతో కలిసి బడీ మసీదులో సామూహిక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఇరువర్గాల ప్రజలు గంగా జమున తైజీబ్ వలే కలిసి మెలిసి ఉంటారని అన్నారు. ఇరు వర్గాల ప్రజలు పండగలను ఐక్యంగా జరుపుకుంటూ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గుల్షాన్ నగర్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఇఫ్తార్ విందును ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనవాస్‌రావు, మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ప్రవీణ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్ బడీ మసీదులో ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముత్తవల్లి నజీర్ అలీ





ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబాతో కలిసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలు, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ప్రకాష్, రాజు, ఝాన్సీ, నాగునగేష్, విజయ్, పరుశరామ్, భానుప్రకాష్, శ్యామ్‌సుందర్, ప్రదీప్‌గౌడ్, వినోద్;సలీం తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న టీడీపీ మాజీ కార్పొరేటర్ బాల్‌రాజ్‌గౌడ్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జంగం దశరథ్ తదితరులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తెలుగువారికి శుభాలు జరగాలి

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగువారికి నూతన సంవత్సరంలో శుభాలు జరగాలని ప్రముఖ న్యాయవాది శ్రీరాముల జగదీశ్వరరావు అన్నారు. వజ్ర డిజిటల్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ పఠనం కార్యక్రమం జరిగింది. జ్యోతిష్య విశారద డా. వేణుగోపాల్ ఈ సందర్భంగా పంచాంగ పఠనం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరాముల జగదీశ్వరరావు మాట్లాడుతూ ఉగాది పండగ తెలుగు వారి జీవితాల్లో నూతన ఉత్తేజాన్ని నింపాలని అభిలషించారు. కార్యక్రమంలో ఫిల్మ్ అనలిస్ట్ పిఆర్‌కె ప్రసాద్, ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి ఎండోవాస్కులర్ సర్జన్ జీవీ ప్రవీణ్‌కుమార్, పల్మనాలజిస్ట్ నిరుపమ దేవి, ఆయుర్వేద ఎండి డా. టిఎస్ లక్ష్మి, ఫిల్మ్ ప్రొడ్యూసర్ డిఎస్ మూర్తి, మోటివేషనల్ ట్రైనర్ శశాంక్ సాలోజు, న్యాయవాది కృపాదేవి, సీనియర్ జర్నలిస్ట్ అశోక్‌గౌడ్, వేణుగోపాల్, సింధు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.







వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్న ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు

యువత భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): యువత భక్తిభావాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం తిరుమల తిరుపతి స్వామివారిని దర్శనం చేసుకున్న ఆయన మాట్లాడారు. ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ముఠా నరేష్, ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, ఆశిష్ పాల్గొన్నారు.

శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించాలి

● కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పాతరామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఏప్రిల్ 7వ తేదీన నిర్వహిస్తున్నందున ఈ వేడుకలకు ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలని కార్పొరేటర్ యాకర అమృత కోరారు. శనివారం నల్లకుంటలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. శ్రీరామ నవమి సందర్భంగా పాతరామాలయం ప్రాంతంలో శోభాయాత్ర జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని కోరారు.



ఓలా, ఊబర్, రాపిడో శ్రమదోపిడీని అరికట్టాలి

● తెలంగాణ క్యాబ్ డ్రైవర్లు

కవాడిగూడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఊబర్ రాపిడో సంస్థలు చేస్తున్న శ్రమదోపిడీని అరికట్టాలని, తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీవో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న ఇరత రాష్ట్రాల టాక్సీప్లేట్ వాహనాలపై వెంటనే కేసులు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర క్యాబ్‌డ్రైవర్లు బత్తుల ప్రసాద్, ఉలవల సాగర్, పాత్లావత్ వినోద్, సాయికిరణ్, గంగాధర్, బానోత్‌రమేష్, బాబ్జి శ్రీకాంత్, చిలకరాజులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. స్వయం ఉపాధితో బతుకుతున్న డ్రైవర్, కార్మికులు కార్పొరేట్ సంస్థలు అయిన ఓలా ఊబర్, రాపిడోల వల్ల శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు. తమన్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డ్రైవర్ల శ్రమదోపిడీకి పాల్పడతున్న ఓలా, ఊబర్, రాపిడో సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ క్యాబ్ డ్రైవర్‌లు పెద్ద సంఖ్యలో హాజరై ఓలా, ఊబర్, ర్యాపిడోలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రవాణా శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వాహన యాప్‌లు క్యాబ్ డ్రైవర్ల నుంచి వసూలు చేస్తున్న కమిషన్లను తగ్గించాలని డిమాండ్ చేశారు.





డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

● బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్ నవీన్ గౌడ్

ముషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్‌ను ఆధునీకరించి డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జా యింట్ కన్వీనర్ నవీన్ గౌడ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌తో కలిసి డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నవీన్‌గౌడ్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అధికారులు నిర్మాణ పనులల్లో జాప్యం లేకుండా వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు లక్ష్మణ్, బాలు, మహేష్ పాల్గొన్నారు.





వాసవీ సేవా సమితి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని శనివారం రాంనగర్ చౌరస్తాలో అన్నదానం చేశారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

